## మొదటి ప్రకరణం

# మానవ జీవితంలో వైముఖ్య దశ, చెడు విశ్వాసాలు

అల్లాహ్ జీవులను తన ఆరాధన (దాస్యం) కోసమే సృష్టించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ ☆ مَا أُرِيدُ مِنْهُم مِّن رِّزْقٍ وَمَا أُرِيدُ أَن يُطْعِمُونِ ☆ إِنَّ اللَّهَ هُوَ الرَّزَّاقُ ذُو الْقُوَّةِ الْمَتِينُ﴾ (الذاريات:٥٦،٥٨)

**"నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది వారు నన్ను ఆరాధించటానికి మాత్రమే. నేను వారి నుండి జీవనోపాధిని కోరటం లేదు. వారు నాకు తినిపించాలని కూడా నేను కోరటం లేదు. అల్లాహ్‌యే స్వయంగా అందరికీ ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహాశక్తిశాలి, మహాబలుడు." (అజ్ జారియాత్ : 56 – 58)**

మానవాత్మను గనక దాని నైజంపైనే వదలిపెడితే అది తప్పక దేవుని ఏకత్వాన్ని అంగీకరిస్తుంది. మనిషి సహజంగానే దైవాన్ని ప్రేమిస్తాడు. ఆయన్ని ఆరాధిస్తాడు. ఆయనకు సహవర్తునిగా ఎవరినీ చేర్చడు. కాని పరిస్థితుల ప్రభావానికి అతను తలొగ్గుతాడు. షైతానుల, మనుషుల మాయాజాలానికి మోసపోయి, వారికి ఆకర్షితుడై రుజుమార్గం నుండి ప్రక్కకు వైదొలుగుతాడు. తత్కారణంగా అతని నైజంలో చెడుగు వచ్చేస్తుంది. అతను సత్యం పట్ల విముఖుడవుతాడు. కనుక అవగతమయ్యేదేమంటే మానవ నైజంతో దేవుని ఏకత్వం (తౌహీద్) పెనవేసుకుని ఉంది. షిర్క్ మనిషికి అపరిచితమైనది. అది అతనిపై కొత్తగా రుద్దబడిన అపచారం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَأَقِمْ وَجْهَكَ لِلدِّينِ حَنِيفًا فِطْرَتَ اللَّهِ الَّتِي فَطَرَ النَّاسَ عَلَيْهَا لَا تَبْدِيلَ لِخَلْقِ اللَّهِ﴾ (الروم:٣٠)

**"కనుక నీవు ఏకాగ్రతతో నీ ముఖాన్ని (ఇస్లాం) ధర్మంపై కేంద్రీకరించు. ఇది అల్లాహ్ సహజధర్మం. అల్లాహ్ మానవులను ఏ స్వభావంపై పుట్టించాడో ఆ స్వభావంపైనే ఉండు. అల్లాహ్ సృష్టిని మార్చకూడదు సుమా!" (అర్ రూమ్ : 30)**

ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రబోధించారు :

"كُلُّ مَوْلُودٍ يُولَدُ عَلَى الْفِطْرَةِ فَأَبَوَاهُ يُهَوِّدَانِهِ أَوْ يُنَصِّرَانِهِ أَوْ يُمَجِّسَانِهِ" (بخاری و مسلم)

**"పుట్టే ప్రతి పిల్లవాడు తన సహజ ధర్మం (ఇస్లాం)పైనే పుడతాడు. తరువాత అతని తల్లిదండ్రులు అతన్ని యూదునిగానో, క్రైస్తవునిగానో, మజూసీగానో మార్చివేస్తారు." (బుఖారీ, ముస్లిం)**

https://teluguislam.net

కాబట్టి ఆదం సంతతిలో అంతర్లీనమై ఉన్న అసలు విషయం దేవుని ఏకత్వమే (తౌహీద్).

ఆది మానవుడు ఆదం (عليه السلام) గానీ, ఆయన సంతతి వారు గానీ ఎన్నో ఏండ్ల వరకు ఇస్లాం ధర్మం పైనే నడిచారు. ఈ విషయాన్నే అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

﴿كَانَ النَّاسُ أُمَّةً وَاحِدَةً فَبَعَثَ اللّٰهُ النَّبِيِّينَ مُبَشِّرِينَ وَمُنذِرِينَ﴾ (البقرة:٢١٣)

**“మానవులంతా ఒకే సమాజంగా ఉండేవారు. అల్లాహ్ ప్రవక్తలను శుభవార్తనిచ్చే వారుగా, భయపెట్టేవారుగా చేసి పంపాడు.” (అల్ బఖర:213)**

అన్నిటికన్నా ముందు నూహ్ జాతివారిలో షిర్క్ (బహుదైవోపాసన) జొరబడింది. సత్యంపట్లా వైముఖ్య దశ మొదలయింది వారి నుంచే. కాబట్టి షిర్క్ పొడసూపిన తరువాత మనుజ జాతి వైపు పంపబడిన మొట్టమొదటి దైవప్రవక్త హ్రజత్ నూహ్ (عليه السلام). అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّا أَوْحَيْنَا إِلَيْكَ كَمَا أَوْحَيْنَا إِلَىٰ نُوحٍ وَالنَّبِيِّينَ مِن بَعْدِهِ﴾ (النساء:١٦٣)

**“(ఓ ముహమ్మద్!) మేము నూహ్ వైపు, అతని తరువాత వచ్చిన ప్రవక్తల వైపు వహీ (దివ్య వాణి)ని పంపినట్లే, మేము నీ వైపునకు కూడా వహీని పంపాము.” (అన్ నిసా : 163)**

హ్రజత్ ఇబ్నె అబ్బాస్ (رضي الله عنهما) ఇలా అన్నారు: ఆదం (عليه السلام) కి – నూహ్ (عليه السلام) కి – మధ్య పది శతాబ్దాల అంతరం ఉంది. ఈ మధ్య కాలంలో ఆదం సంతతి వారంతా ఇస్లాంపైనే ఉన్నారు.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇలా వ్యాఖ్యానించారు : “ఖచ్చితంగా ఈ మాటే సరైనది. ఎందుకంటే బఖరా సూరాలోని ఈ వచనం (ఆయత్) ఉబై బిన్ కాబ్ (رضي الله عنه) పారాయణంలో ఇలా వచ్చింది :

“فَاخْتَلَفُوا فَبَعَثَ اللّٰهُ النَّبِيِّينَ”

**“తరువాత జనులు (దేవుని ఏకత్వం వ్యవహారంలో) విభేదించు కోవటం వల్ల అల్లాహ్ తన ప్రవక్తలను ప్రభవింపజేశాడు.”**

ఈ క్రింది సూక్తి కూడా ఉబై బిన్ కాబ్ పారాయణాన్ని సమర్థిస్తూ ఉంది :

﴿وَمَا كَانَ النَّاسُ إِلَّا أُمَّةً وَاحِدَةً فَاخْتَلَفُوا﴾ (يونس:١٩)

**“మొదట్లో జనులంతా ఒకే సముదాయంగా ఉండేవారు. తరువాత వారు విభేదించుకున్నారు.” (యూనుస్ : 19)**

ఈ సూక్తి ఆధారంగా అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) రుజువు చెయ్యదలచిన విషయం ఇది :

నిజధర్మం విషయంలో మానవుల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయమే ప్రవక్తల రాకకు ప్రధాన కారణమయింది. ఉదాహరణకు : ఒకప్పుడు అరబ్బులు కూడా ప్రవక్త ఇబ్రాహీం (عليه السلام) ధర్మంపై స్థిరంగా ఉండేవారు. చివరకు అమ్ర్ బిన్ లుహాయియా అల్ ఖుజాయి అనే వ్యక్తి వచ్చి ఇబ్రాహీం (عليه السلام) మత ధర్మాన్ని మార్చివేశాడు. అరేబియా భూభాగంలో – ముఖ్యంగా హిజాజ్ ప్రదేశంలో బహుదైవారాధనా బీజం నాటుకుంది. ప్రజలు నిజదైవం అయిన అల్లాహ్‌ను వదలి విగ్రహాలను పూజించటం మొదలెట్టారు. పవిత్ర మక్కా నగరంలోనూ, దాని చుట్టుప్రక్కల పట్టణాలలోనూ షిర్క్ (బహుదైవోపాసన) ప్రబలిపోయింది. ఎట్టకేలకు దేవుని అంతిమ ప్రవక్త ముహమ్మద్ (صلى الله عليه وسلم) ప్రభవించారు. ఆయన (صلى الله عليه وسلم) ప్రజలను ఏకేశ్వరోపాసన (తౌహీద్) వైపునకు పిలిచారు. ఇబ్రాహీమ్ (عليه السلام) విధానాన్ని అవలంబించమని కోరారు. దైవమార్గంలో నిరంతర పోరాటం సాగించారు. ఆఖరికి ఏకేశ్వరోపాసనా సిద్ధాంతం స్థాపించబడింది. దీనె ఇబ్రాహీం పునరుద్ధరించబడింది. విగ్రహాలు కూల్చబడ్డాయి. ఆ విధంగా అల్లాహ్ ఆయన (صلى الله عليه وسلم) ద్వారా తన ధర్మాన్ని పరిపూర్ణం గావించాడు. లోకవాసులపై తన కరుణానుగ్రహాలను సంపూర్తి చేశాడు. ఆయన (صلى الله عليه وسلم) అనుచరవర్గంలోని ప్రథమ శ్రేణికి చెందిన వారంతా తొలి శతాబ్దాలలో ఇదే విధానానికి కట్టుబడి ఉన్నారు. కాని తరువాతి కాలంలో అజ్ఞానం ప్రబలిపోయింది. ఇతర మతాల ప్రభావం ముస్లిములపై పడసాగింది. ఆ తరువాత మార్గవిహీనత వైపు పిలుపు ఇచ్చేవారు పుట్టుకువచ్చారు. వారి మూలంగా సమాధులపై గుంబదులు, కట్టడాల నిర్మాణం మొదలయింది. ఔలియాల, సత్పురుషుల పట్ల ప్రేమ, భక్తి పేరుతో ముస్లిం సముదాయంలోని చాలామందిలో మళ్లీ షిర్క్ ప్రబలిపోయింది. వారు మృతుల సమాధులనే విగ్రహాలుగా చేసుకున్నారు. అల్లాహ్‌ను వదలి ఆ మృతులను పూజించటం మొదలెట్టారు. వారినే వేడుకోసాగారు. వారి దర్బారులో విన్నపాలు, ఫిర్యాదులు చేసుకోసాగారు. వారి పేర మొక్కుకోవటం, మొక్కుబడులు చెల్లించటం, పశుబలి చేయటం కూడా జరిగింది. ఈ విధమయిన షిర్క్ చేష్టలకు ఒడిగట్టేవారు, తమ చర్యలకు సమర్థనగా కొత్త భాష్యాలు చెప్పారు. తాము తమ పూర్వీకులను ఆరాధించటం లేదని, వారిని 'వసీలా' (సిఫార్సు సాధనం)గా చేసుకుంటున్నామని బుకాయించారు. ఇదంతా వారి ఊహాగానమే. ఇలాంటి పనులు చేసిన పూర్వీకులంతా ఇలాగే చెప్పేవారు. ఉదాహరణకు :

﴿مَا نَعْبُدُهُمْ إِلَّا لِيُقَرِّبُونَا إِلَى اللَّهِ زُلْفَىٰ﴾ (الزمر:٣)

**"ఈ పెద్దలు మమ్మల్ని అల్లాహ్ సాన్నిధ్యంలో చేర్చటంలో తోడ్పడతారని భావించి మాత్రమే మేము వీళ్ళను ఆరాధిస్తున్నాము."(అజ్ జుమర్ : 3)**

తరతరాలుగా ఇది మానవ జాతి చరిత్రలో జరుగుతూ వస్తున్నదే. ఇంతచేసీ వారు 'తౌహీదె రుబూబియత్'ను ఒప్పుకునేవారు. దైవారాధనలో మాత్రమే వారు షిర్క్‌కి ఒడిగట్టేవారు. ఉదాహరణకు : ఒకచోట దేవుడిలా సెలవిచ్చాడు :

﴿وَمَا يُؤْمِنُ أَكْثَرُهُم بِاللَّهِ إِلَّا وَهُم مُّشْرِكُونَ﴾ (يوسف:١٠٦)

**“వారిలో చాలామంది అల్లాహ్‌ను విశ్వసిస్తూ కూడా ఆయనతో పాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతున్నారు.” (యూసుఫ్ : 106)**

మానవ జాతిలో బహుకొద్ది మంది మాత్రమే 'ప్రభువు' అస్తిత్వాన్ని నిరాకరించారు. ఉదాహరణకు : ఫిర్‌ఔన్, నాస్తికులు, పాషండులు, కలికాలపు కమ్యూనిస్టులు. వారి నిరాకరణ వెనుక కూడా మంకుతనం, హఠమే ప్రధాన కారణం. నిజానికి వారి మనస్సాక్షి కూడా 'ప్రభువు ఉనికి'ని అంగీకరించే ఉంటుంది. ఈ రకమయిన జనులను గురించి దైవోపదేశం ఇది :

﴿وَجَحَدُوا بِهَا وَاسْتَيْقَنَتْهَا أَنفُسُهُمْ ظُلْمًا وَعُلُوًّا﴾ (النمل:١٤)

**“నిజానికి వారి ఆంతర్యాలు (సత్యాన్ని) నమ్మినప్పటికీ అన్యాయం, అహంకారంతో వారు దాన్ని త్రోసిపుచ్చుతున్నారు.”**

**(అన్ నమ్ల్ : 14)**

https://teluguislam.net